సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



అవస్థల ప్రయాణం..! - 8లో

సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళాసంక్షేమ పథకాలను పక్కన పెట్టింది.



కోడూరుమాత యాత్రోత్సవం నేడు

కోడూరు మరియమాత యాత్రోత్సవం శనివారం జరగనుంది. ఈ యాత్రలో సుమారు 20వేలమంది క్రైస్తవ, ఇతర మతస్తులైన యాత్రికులు పాల్గొననున్నారు. - 8లో



గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు - 8లో

గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఎస్పీలను ఆదేశించారు.

న్యూస్‌రీల్

డీఐపీఆర్‌ఓగా బాలమాన్‌సింగ్



పార్వతీపురం రూరల్: సమాచార పౌరసంబంధాల శాఖ సహాయ సంచాలకులు, జిల్లా సమాచార సంబంధాల అధికారిగా క్షత్రి బాలమాన్‌సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు డీఐపీఆర్‌ఓగా విధులు నిర్వహించిన ఎల్.రమేష్ ఉద్యోగోన్నతిపై గుంటూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సింగ్‌ను నియమిస్తూ సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు కాకముందు పార్వతీపురం డివిజనల్ అధికారిగా సింగ్ సేవలందించారు. అనంతరం 2022లో శ్రీకాకుళం జిల్లా అధికారిగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. పాడేరులో పనిచేస్తూ పదోన్నతిపై పార్వతీపురం మన్యం జిల్లా సమాచార శాఖలో సంచాలకులుగా నియామకమయ్యారు.

తోటపల్లికి వరద పోటు



నదిలోకి విడిచిపెట్టిన ప్రాజెక్టు నీరు

గరుగుబిల్లి: నాగావళి నది నుంచి తోటపల్లి ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం పెరిగింది. శుక్రవారం సాయంత్రానికి 105 మీటర్లకు 104.51 మీటర్ల మేర నీరు నిల్వఉంది. ప్రస్తుతం నది నుంచి 6,500ల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో చేరుతుండగా అధికారులు రెండు గేట్లును ఎత్తివేసి 5 వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. కాలువలకు మరో 1,320 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు వద్ద నీటి నిల్వను ఏఈ కిశోర్ పర్యవేక్షిస్తున్నారు.

పుట్టగొడుగులు లభ్యం



మూలజమ్ము గ్రామ సమీపంలోని పొదల్లో సహజసిద్ధంగా విరబూసిన పుట్టగొడుగులు

గుమ్మలక్ష్మీపురం: వర్షాలు కురుస్తుండడంతో ఏజెన్సీ గ్రామాల్లో పుట్టగొడుగులు పుష్కలంగా లభిస్తున్నాయి. పుట్టగొడుగుల సేకరణపై ఆసక్తి ఉన్న గిరిజనులు గ్రామ పరిసరాల్లోని పొదలు, ఖాళీ స్థలాల్లో వెతుకుతున్నారు. ఒక్కోచోట విస్తారంగా మొగ్గలు, విరబూసిన పూల రూపంలో లభించిన పుట్టగొడుగులను సేకరించి విక్రయిస్తున్నారు.

శ్యామ్‌ప్రసాద్‌కు ఆత్మీయ వీడ్కోలు



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జేసీ, పాల్గొన్న జిల్లా అధికారులు

పార్వతీపురం టౌన్: జిల్లా అభివృద్ధికి కృషిచేసి జిల్లా ప్రజలు మనసు గెలుచుకున్న వ్యక్తి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అని జిల్లా అధికారులు ప్రశంసలు కురిపించారు. జిల్లా ఆవిర్భావం తరువాత రెండో కలెక్టర్‌గా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి తనదైన ముద్రవేశారని కొనియాడారు. కలెక్టర్‌గా విశిష్ట సేవలందించి బదిలీపై వెళ్తున్న శ్యామ్‌ప్రసాద్‌కు పార్వతీపురంలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ వెనుకబడిన పార్వతీపురం మన్యం జిల్లా సమగ్ర అభివృద్ధికి ఆయన కృషి, పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జేసీ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్‌కలెక్టర్లు డాక్టర్ ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మ చంద్రారెడ్డి, ఎస్.దిలీప్‌చక్రవర్తి, డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కొండలరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్ పాల్, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, డీఈఓ బి.రాజ్‌కుమార్, ఏఎస్పీ అంకితా సురాన, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి అమానుషం



ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పత్రికలు కీలకపాత్ర పోషిస్తాయి. పత్రికా స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం వ్యవహరించడం తగదు. ఓ నాయకుడి ప్రెస్‌మీట్ వార్తను యథాతథంగా ప్రచురించినా కేసులు పెట్టడం విచాకరం. పోలీస్ వ్యవస్థలో పదోన్నతుల విషయంలో జరిగిన అక్రమాలపై వార్తను ప్రచురించిన 'సాక్షి'పై కక్ష కట్టడం ఎంతవరకు సమంజసం. ఎడిటర్, బ్యూరో ఇన్‌చార్జిలపై కేసులు పెట్టడం, విచారణ పేరుతో వేధించడం సరి కాదు. గతంలో ఎన్నడూ, ఏ ప్రభుత్వమూ చేపట్టని తీరు ఇది. పత్రికా స్వేచ్ఛకు కూటమి ప్రభుత్వం సంకెళ్లువేయాలని చూస్తోంది. పత్రికల్లో ప్రచురితమైన కథనాల్లో అభ్యంతరాలుంటే తెలియజేయాలే తప్ప పోలీస్ కేసులు పెట్టడం సరికాదు.

- బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్



మర్యాదపూర్వక కలయిక

పార్వతీపురం రూరల్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, పార్వతీపురం ఐటీడీఏ పీఓగా గురువారం బాధ్యతలు స్వీకరించిన సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా ఉన్న ఎ.శ్యామ్ ప్రసాద్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా నియామకమైన ఎస్.ప్రభాకరరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరిస్తారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు పూలమొక్కను అందజేస్తున్న జేసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

అటుకుల మిల్లు అయినా రాలే..!

- కంపెనీల'లోకం' చూపి కుర్రాళ్లకు ఎర..
- వంద రోజుల్లో వంద కంపెనీలంటూ ప్రచారం
- కనీసం పిండిఒడియాల ఫ్యాక్టరీ అయినా రానిదైనం?
- నున్నండల కంపెనీ అయినా తెచ్చారా అంటే అదీ లేదు ?
- అటుకుల మిల్లు.. అప్పడాల కొట్టినా రాలేదు..
- ఆశలు వీడి ఉపాధికోసం పొరుగు రాష్ట్రానికి పయనం



సాక్షిప్రతినిధి విజయనగరం:

ఒరేయ్ గుంటడా.. డిగ్రీ అవ్వగానే హైదరాబాద్ వెళ్లిపోరా.. ఏదో ఒక కంపెనీలో చేరితే రెండేళ్లలో జీతం పెరుగుతాది... బాగుపడతావు అన్నాను.. విన్నావా... ఊరు దాటేది లేదు. ఉన్న ఊళ్లోనే ఎమ్మెల్యే పండక్కి గొబ్బెమ్మలు పెట్టినంత సులభంగా కంపెనీలు పెట్టేద్ది.. గోడకు భోగిపిడకలు కొట్టినంత తేలిగ్గా ఉద్యోగాలు ఇచ్చేద్ది.. వంద రోజుల్లో వంద కంపెనీలు... భోగాపురం బస్టాండ్ పక్కనే ఉద్యోగాలు వస్తాయన్నావు. ఇప్పుడు చూడు గేదెలు మేపుకుంటున్నావ్ అంటూ అప్పన్న తన కొడుకు శీనుగాడిపై అసహనం వ్యక్తంచేశాడు. అవును నాన్నా దెబ్బైపోనాం.. అన్నాడు శీనుగాడు. ఇది ఒక్క శీను పరిస్థితి కాదు.. తీయని మాటలు నమ్మి.. గాలిలో విహరించిన ఎంతోమంది నెల్లిమర్ల యువకుల కలలు కరిగిపోయాయి.

స్టేటస్ లేని బతుకులు...

మేడం సార్.. మేడం.. అంతే .. అంటూ అప్పట్లో కుర్రాళ్లు స్టేటస్‌లు పెట్టుకున్నారు.. ఇప్పుడు ఆ స్టేటస్ ఎగిరిపోయింది.. స్టేటస్ లేని బతుకులయ్యాయి. యువత కంపెనీ కలలు కరిగిపోగా.. వాళ్లంతా వీధిన పడ్డారు. వందరోజుల్లో వంద కంపెనీలు అనగానే కుర్రాళ్లు గాలిలో తేలినట్లుందే.. గుండె పేలినట్లుందే.. అన్నట్టుగా ఎగిరెగిరి పడ్డారు. నిజమే.. చివరకు మబ్బుల్లో తేలి మత్తు వదలగానే బండరాళ్ల మీద పడ్డారు. ఏడాదిన్నర అవుతోంది. వంద కంపెనీలు కాదు కదా.. అటుకుల మిల్లు. అప్పడాల కొట్లు కూడా రాలేదు. ఒక కంపెనీ రావాలంటే ఎంత ప్రక్రియ ఉంటుంది.. ఎన్ని రూల్స్.. ఎన్ని నిబంధనలు.. ఎన్ని అనుమతులు.. ఇవేమీ లేకుండా వందరోజుల్లో వందలాది కంపెనీలు అని ఎమ్మెల్యే లోకం మాధవి చెప్పడం.. జనాలు నమ్మడం.. జరిగిపోయింది. ఎన్నికలు ముగిశాయి. ఆమె అసెంబ్లీకి వెళ్లిపోగా కంపెనీలు వస్తాయని చూసిన యువత మళ్లీ జంపరు బనీను వేసుకుని గేదెలు కాయడానికి వెళ్తున్నారు. అసలు ఈ ఏడాదిన్నరలో కనీసం ఒక్కటంటే ఒక్కటైనా కంపెనీ వచ్చిందా.. అసలా అవకాశం ఉందా.. ఉంటే ఈ ఏడాదిలో ఈ దిశగా ఆమె వేసిన అడుగులు.. చేసిన ప్రయత్నం.. వాటి పురోగతి మీద ఏమైనా సెల్ఫ్ అసెస్మెంట్ రిపోర్ట్ ఇచ్చారా? అదేం లేదు. ఎంతసేపూ ఎమ్మార్వో ఆఫీసులకు.. ఎంపీడీఓలకు తన తరఫున నాయకుల లిస్ట్ ఇచ్చి.. వీళ్లకు రెస్పెక్ట్ కావాలి.. వీళ్లకు ప్రోటోకాల్ కావాలి.. వీరు చెప్పిన పనులే చేయాలని డిమాండ్ చేయడం మినహా ఇంకేమైనా జరిగిందా అంటే ఆఖరుకు ఆమె పార్టీ శ్రేణులు కూడా లేదు లేదనే చెబుతున్నాయి. ఊళ్లలో.. గ్రామాల్లో వైషమ్యాలు రెచ్చగొట్టి.. పెద్దరికం చేసినంత ఈజీగా కంపెనీలు తేవడం.. ఉద్యోగాలు కల్పించడం అయ్యేది కాదని మేడంకు అర్థం అయిందో.. అయినా కానట్లు.. ఇంకా యువతను భ్రమింపజేస్తూ ఉన్నారో తెలియదు కానీ.. మొత్తానికి వందరోజులు.. వంద కంపెనీలు అనే కాన్సెప్ట్ మాత్రం రాజకీయాల్లో కామెడీ స్థాయిని మరో మెట్టుకు చేర్చింది. మూడునాలుగు సార్లు ఎమ్మెల్యేలు అయినవాళ్లు కూడా ఊరికి ఒక రైస్ మిల్లు.. రెండు బ్రెడ్ బేకరీలు తీసుకురావడం కుదరని పని. కానీ మేడం మాత్రం ఏకంగా వంద కంపెనీలు అనేసరికి యువత పూర్తిగా నమ్మేసి ఆమెను అనుసరించారు. ఇప్పుడు చూస్తే చెరుకు రసం బళ్లు.. అప్పడాలు ఒత్తుకునే మిషన్లు కూడా రాకపోయేసరికి ఉసూరుమంటూ మళ్లీ హైదరాబాద్ బాట పడుతున్నారు.

నమ్మించి.. నట్టేట ముంచి..

మీకు తెలుసుగా.. మనది ఐటీ కంపెనీ.. మన చుట్టూ ఉన్నవాళ్లు కూడా ఐటీ వాళ్లే.. మనం మిట్టకాయ కొట్టగానే పెట్టుబడులు వచ్చేస్తాయి. చిటుకేస్తే చిప్ కంపెనీలు.. చప్పట్లు కొడితే ప్రాజెక్టులు.. అంతెందుకమ్మా మనం గట్టిగా అనుకోవాలే గానీ ఏ ఊరి కుర్రాళ్లకు ఆ ఊళ్లోనే ఉద్యోగాలు ఇప్పించేసేలా ఊరి చివర చెరువుగట్టు పక్కన ఐటీ కంపెనీ పెట్టించేయగలను. ఏమ్మా.. మీరేమంటారు... కంపెనీలు కావాల్నా వద్దా.. అన్నట్లుగా ఉండేవి అప్పట్లో మేడం మాటలు. హార్డ్ వేరా.. సాఫ్ట్ వేరా.. డెవలప్మెంటా.. టెస్టింగా.. ఏదైనా మీదే చాన్స్ అనడంతో కుర్రాళ్లు ఒంటిమీద బట్టలతో బాటు బీరువాలోని గుడ్డలు కూడా చించేసుకుని ఎన్నికల్లో పని చేశారు. ఆమె ఫొటోలతో ఉన్న బకెట్లను ఇంటింటికీ తెగ పంపిణీ చేసేసి ప్రచారం చేశారు. కొందరు ఎన్నికల అధికారులకు పట్టుబడ్డారు కూడా. పాపం ఎన్నికలయ్యేసరికి వీళ్లకు చింకి బనీన్లు మిగిలాయి. మేడం మీద ఆశలు వదులుకుని ఇప్పుడు ఫార్మా కంపెనీలు.. ఇతరత్రా ఫ్యాబ్రికేషన్ కంపెనీల్లో పనులకోసం జీడిమెట్ల, బొల్లారం ప్రాంతాలకు యువకులు తరలివెళ్తున్నారు.

కొలిక్కి వచ్చిన భూ సమస్య



వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న వీరఘట్టం, జియ్యమ్మవలస మండలాల రెవెన్యూ అధికారులు

వీరఘట్టం/జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినగోర రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 17లో ఉన్న 20 ఎకరాల భూ సమస్యకు శుక్రవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపారు. ఆక్రమణకు గురైన సుమారు 20 ఎకరాల భూమి వీరఘట్టం మండలం చినగోర రెవెన్యూ పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సర్వే నంబర్ 17లో ఉన్న 151 ఎకరాల భూమిని 18 ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం వీరఘట్టం మండలం సంతనర్సిపురంలో ఉన్న భూమిలేని పేదలకు ఎకరా చొప్పున కేటాయించింది. అందరికీ డీ పట్టాలు ఇచ్చింది. అయితే, భూమి అప్పగించలేదు. చినగోర రెవెన్యూ గ్రామానికి పక్కనే ఉన్న జియ్యమ్మవలస మండలం గడసింగుపురం, ఏనుగులగూడకు చెందిన కొందరు వ్యక్తులు ఈ భూమిలో సుమారు 20 ఎకరాలను కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. ఈ భూమిపై హక్కు కల్పించాలని జియ్యమ్మవలస మండలానికి చెందిన వారు కూడా అధికారులపై ఒత్తిడిచేశారు. ఈ క్రమంలో సంత-నర్సిపురం లబ్ధిదారులకు, భూములు సాగు చేస్తున్న జియ్యమ్మవలస మండలానికి చెందిన వారికి కొన్నేళ్లుగా తగాదాలు జరుగుతున్నాయి. పోలీసు కేసులు కూడా నమోదయ్యాయి. ఆ భూమిని వీరఘట్టం, జియ్యమ్మవలస మండలాల తహసీల్దార్లు ఎ.ఎస్.కామేశ్వరరావు వై.జయలక్ష్మి, సర్వే అధికారులు చినమేరంగి సీఐ టి.తిరుపతిరావు, వీరఘట్టం, జియ్యమ్మవలస ఎస్ఐలు జి.కళాధర్, ప్రశాంత్‌కుమార్‌ల సమక్షంలో పరిశీలించారు. ప్రస్తుతం జియ్యమ్మవలస మండలం వారు సాగుచేస్తున్న 20 ఎకరాల భూములు వీరఘట్టం మండలంలో ఉన్నట్లు గుర్తించారు. సోమవారం నాటికి ఈ భూములను లబ్ధిదారులకు అప్పగిస్తామని స్పష్టంచేశారు.

రూ.4 వేల పారితోషికం..
నెలల తరబడి పెండింగ్..!



కొమరాడ మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (ఫైల్)

- ఆర్థిక ఇబ్బందుల్లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు
- ఆశవర్కర్లుగా గుర్తించాలని డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా 1565 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

పార్వతీపురంటౌన్: వారంతా ఎండ, వానను లెక్కచేయకుండా మారుమూల గిరిశిఖర, గిరిజన ప్రాంతంలో ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ వైద్యకార్యక్రమాలు క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో కీలకభూమిక పోషిస్తున్నారు. వీరి సేవలకు ప్రభుత్వం కేవలం నెలకు రూ.4వేలు పారితోషికం అందజేస్తోంది. అదికూడా నెలల తరబడి అందజేయకపోవడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ తీరుపై నిరసన తెలుపుతున్నారు.

సేవలు ఇలా..

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 1190 మంది, సీతంపేట ఐటీడీఏ పరిధిలో 375 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. వారంతా ఆశ వర్కర్లతో సమానంగా పనిచేస్తున్నా వేతనాలు పెంచలేదు. కనీసం ఆశవర్కర్లుగా మార్పుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడంలేదు.

బకాయి వేతనాలు చెల్లించండి



సీహెచ్‌డబ్ల్యూఓలకు పారితోషికం బకాయిలను తక్షణమే చెల్లించాలి. ఆశ వర్కర్లుగా మార్పుచేయాలి. ప్రజాసంక్షేమ పథకాలు అందజేయాలి. లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

– గొర్లి వెంకటరమణ, సీఐటీయూ జిల్లా కోశాధికారి, పార్వతీపురం

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల డిమాండ్లు ఇవీ..

- సీహెచ్ డబ్ల్యూలను ఆశ వర్కర్లుగా మార్పు చేయాలి.
- పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో నాలుగు నెలల పారితోషికం బకాయిలను వెంటనే చెల్లించాలి.
- యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
- సీహెచ్‌డబ్ల్యూలకు అధికార్లతో జాయింట్ మీంటింగ్ గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
- 2018 సంవత్సరం కాలంలో 970 మందికి అందజేయాల్సిన 21 నెలలు పారితోషికాన్ని తక్షణమే చెల్లించాలి.

ఇబ్బందులు పడుతున్నాం



అన్నవరం పీహెచ్‌సీ పరిధిలో గత పదేళ్లుగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. గిరిశిఖర గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం. ఆశ వర్కర్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా పారితోషికం పెంచడంలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

- ఆరిక భూలక్ష్మి, సీహెచ్‌డబ్ల్యూ, అన్నవరం

స్పందించాలి



ప్రభుత్వ పాలకులు స్పందించాలి. రూ.4వేలుతో ఎలా బతకగలమో గుర్తించాలి. పెరిగిన ధరలు, కుటుంబాల అవసరాలకు పారితోషికం సరిపోవడం లేదు. ఆశ వర్కర్లుగా గుర్తించి వేతనం పెంచాలి.

- తోయక భాగ్యలక్ష్మి, సీహెచ్‌డబ్ల్యూ, వాడబాయి

అడ్డాకుల గూడలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని అడ్డాకుల గూడలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. 'అడ్డాకులగూడను వణికిస్తున్న కిడ్నీ భూతం' శీర్షికన జూలై 24న 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అదే నెల 25న గ్రామాన్ని సందర్శించారు. వైద్య తనిఖీలతో పాటు నీటి పరీక్షలు నిర్వహించారు. ఇప్పుడు శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రికి చెందిన నెఫ్రాలజిస్ట్ డాక్టర్ గిరి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి, కుశిమి పీహెచ్‌సీ వైద్యాధికారి చాందినిలతో కూడిన వైద్యబృందం వైద్యశిబిరం నిర్వహించి రక్తపరీక్షలు చేశారు. వీరిలో కిడ్నీవ్యాధితో బాధపడుతున్న 8 మందిని గుర్తించి శనివారం ప్రత్యేక వాహనంలో జెమ్స్‌కు తరలిస్తామని వైద్యాధికారి చాందిని తెలిపారు. అక్కడ ఉచితంగా కిడ్నీ పరీక్షలు చేయనున్నారు. వ్యాధి నిర్ధారణ అనంతరం ప్రత్యేక వైద్యసేవలు అందిస్తామని వైద్యాధికారులు చెప్పారు.

- జెమ్స్ నెఫ్రాలజిస్టులతో వైద్య పరీక్షలు
- 8 మంది రోగుల గుర్తింపు
- ఉచిత వైద్యసేవల కోసం జెమ్స్‌కు తరలింపు

సాక్షి ఎఫెక్ట్



కిడ్నీ బాధితులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య బృందం



జూలై 24న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సిరులతల్లి ఉత్సవానికి శ్రీకారం



చదురుగుడి వద్ద పందిరిరాట ఉత్సవం

- ప్రత్యేక అలంకరణలో పైడితల్లి
- చదురుగుడి, వనంగుడిల వద్ద పందిరిరాట
- మండల దీక్షలు చేపట్టిన భక్తులు

విజయనగరం టౌన్:

సిరులతల్లి పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు పందిరిరాటతో శుక్రవారం శ్రీకారంచుట్టారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ కె.శిరీష నేతృత్వంలో వేకువజామునుంచి అర్చకులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. ముహూర్తం ప్రకారం ఉదయం 9.30 గంటలకు మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి వద్ద, ఉదయం 10.30 గంటలకు రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి వద్ద పందిరిరాట ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చదురుగుడి వద్ద నిర్వహించిన పందిరిరాట కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు పాల్గొన్నారు. ఆమెకు అర్చకులు వేదాశీస్సులు అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ పైడితల్లి ఆలయ విస్తరణ పనులను ఈ ఏడాది పండగ పూర్తయిన తర్వాత రూ.కోటి 80లక్షల ఖర్చుతో పూర్తిచేస్తామన్నారు. అమ్మవారి పండగను ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు పైడితల్లి అమ్మవారి ఉచిత దర్శన భాగ్యం కల్పిస్తామని చెప్పారు. పందిరిరాట కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ పూజారులు, అధికారులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అమ్మవారి మండల దీక్షలు ప్రారంభం

పైడితల్లి అమ్మవారి పందిరిరాట మహోత్సవం రోజున ఆలయ ఇన్‌చార్జి ఈఓ కె.శిరీష ఆధ్వర్యంలో అమ్మవారి దీక్షాపరులు మండల దీక్షలను సన్నిధానంలో తీసుకున్నారు. దీక్షధారులకు దీక్షావస్త్రాలను ఈఓ అందజేశారు. కార్యక్రమంలో పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో, ఎస్.అచ్చిరెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్


జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం లీగల్: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత ఆధ్వర్యంలో జాతీయలోక్ అదాలత్ శనివారం జరగనుంది. ఇందుకోసం ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా 19 లోక్అదాలత్ బెంచీలను ఏర్పాటు చేశారు. రాజీ పడదగిన క్రిమినల్, మోటార్ ప్రమాద బీమా, చెక్‌బౌన్స్, ప్రాంసరీ నోట్, ఎక్సైజ్, భూమి తగాదా, కుటుంబ తగాదాలు, వాటర్, ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీమార్గంలో శాశ్వత పరిష్కారం చేసుకోవచ్చని కక్షిదారులు, ప్రజలు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి


రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సీనియర్స్ స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడకారులు ఉత్తమ క్రీడా ప్రతిభా పాటవాలతో విజేతలుగా నిలవాలని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఈనెల 13 నుంచి 15 వరకు కాకినాడ జిల్లా మండపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రామారావు క్రీడాదుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వంతో పాటు పతకాలు సాధించిన క్రీడాకారులు ఉద్యోగావకాశాల్లో ముందంజలో ఉంటారన్నారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ జోనల్ కార్యాలయాలు ప్రారంభం

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పరిపాలన సౌలభ్యం కోసం అనకాపల్లి, విజయనగరంలలో నూతనంగా నిర్మించిన వీఎంఆర్‌డీఏ జోనల్ కార్యాలయాలను సంస్థ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి, విజయనగరం ప్రాంత ప్రజలకు పరిపాలన పరంగా మరింత చేరువ కావడానికి వీలుగా వీఎంఆర్‌డీఏ నూతనంగా జోనల్ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విజయనగరంలో రూ.47.95 లక్షలు, అనకాపల్లిలో రూ.33.5 లక్షలతో ఈ కార్యాలయాలను పునర్నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ విభాగాధిపతులు మురళీకృష్ణ వినయ్ కుమార్, హరిప్రసాద్, సుజాతా శివాని, భవానీశంకర్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని పాడి రైతు మృతి


ఈశ్వరరావు మృతదేహం

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన పాడి రైతు పాట్రు ఈశ్వరరావు(45) రైలు ఢీకొని శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానికులు అందించిన వివరాల ప్రకారం ఈశ్వర రావు అలమండ ఎనిమిది కానాల వద్ద రైలు పట్టాల సమీపంలో గేదెలు కాస్తున్న సమయంలో రైలు ఢీకొని మృతిచెందాడు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా వచ్చి పరిశీలించారు.

రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం


రైల్వేట్రాక్‌పై మృతదేహం

జామి: మండలంలోని అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీనిపై ,రైల్వేపోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయస్సు 40-45 సంవత్సరాల మధ్య ఉంటుంది. చామన చాయ రంగులో ఉండి ఎరుపు రంగు పై తెలుపు రంగు గడులు గల టీషర్టు, నీలం రంగు నైట్ ప్యాంట్ ధరించి ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిస్తే ఫోన్ 919490617089, 6301365605 నంబర్లను సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు. ఈ ఘటనపై రైల్వే హెచ్‌సీ వి.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవస్థల ప్రయాణం..!

ఓ వైపు చాలీచాలని బస్సులు..మరో వైపు పాడైపోయిన రహదారులతో సమయానికి రాని బస్సులు..ఇంకో వైపు స్త్రీ శక్తి పథకానికి కేటాయించిన బస్సుల్లో అధిక రద్దీతో గొడవలు..వెరసి సాధారణ ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించేందుకు సతమవుతున్నారు. బస్సుల సమస్యకు పరిష్కారం చూపించాలని ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది కోరుతున్నారు.


ప్రయాణికులతో రద్దీగా ఉన్న పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్

- అరకొరగా బస్సులు
- ఉచిత బస్సుల్లో రద్దీ ఇబ్బందులు
- ఆక్యుపెన్సీ లేదని కొన్ని గ్రామాలకు బస్సుల రద్దు
- జిల్లాలో మూడు డిపోల పరిధిలో 237 ఆర్టీసీ బస్సులు
- వాటిలో 187 బస్సులు స్త్రీశక్తి పథకానికే
- తీవ్ర ఇక్కట్లు పడుతున్న సాధారణ ప్రయాణికులు

పార్వతీపురంటౌన్: సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళాసంక్షేమ పథకాలను పక్కన పెట్టి స్త్రీశక్తి ఉచిత బస్సు అమలు చేసి మమ అనిపించింది. ఆగస్టు 15న స్త్రీశక్తి పథకం అమలు చేసింది. ఈ పథకం ద్వారా ఆర్టీసీ నష్టాల బాటలో నడుస్తున్నప్పటికీ, జిల్లాలో సరిపడా బస్సులు లేకపోయినప్పటికీ ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని గ్రామాలకు సర్వీసులు నడిపే పరిస్థితి లేకపోయింది. మన్యం జిల్లాలో ఎక్కువ గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఉచిత బస్సు ప్రయాణం అంటే మహిళలు పెద్దసంఖ్యలో ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ ప్రయాణం అవస్థల ప్రయాణంగా సాగుతోంది. ఆక్యుపెన్సీ లేని కొన్ని గ్రామాలకు, రోడ్డు బాగాలేని కొన్ని గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు రద్దుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మేరకు ట్రిప్‌లు కుదించారు. జిల్లాపరిధిలోగల సాలూరు, పాలకొండ, పార్వతీపురం డిపోలలో బస్సుల కొరత ఉంది. ఉన్న బస్సుల కండిషన్ కూడా అంతంత మాత్రంగానే ఉంది. వాటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించకుండా ఉచిత బస్సు పథకంతో ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 187 బస్సులు స్త్రీశక్తి పథకానికే..

జిల్లా వ్యాప్తంగా మూడు డిపోల పరిధిలో 237 బస్సులు ఉంటే అందులో పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కలిపి మొత్తం 187 బస్సులు స్త్రీశక్తి పథకానికే ఉపయోగిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో కేవలం 50 బస్సులు మాత్రమే సాధారణ సర్వీసులు నడుపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో గిరిజన, మారుమూల మైదాన ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సులు సరిగ్గా లేక ప్రయాణ అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సుల కొరత ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ పథకానికి బస్సులు వేయడంతో సాధారణ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోంది.

గంటల తరబడి వేచి చూడాల్సిందే

జిల్లాలో మూడు డిపోల పరిధి నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దానికి తోడు రహదారులు గుంతలమయం కావడంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడడం, డిపోలకు సమయానికి బస్సులు రాకపోవడం, కాజ్‌వేలు, వంతెనలు మరమ్మతులకు గురవడం వంటి సమస్యలతో బస్సులు సమయానికి దొరకక వేచిచూడాల్సిన పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఉంది. జిల్లాలో బస్సుల సంఖ్యను పెంచి ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అటు ప్రయాణికులు, ఇటు ఆర్టీసీ ఉద్యోగులు కోరుతున్నారు.

సీట్ల కోసం రోజూ గొడవలే..

అసలే అరకొర బస్సులతో బస్సులకు ప్రయాణికుల తాకిడి ఎక్కువ అవుతోంది. దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు సీట్లు సరిగా దొరకకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా మేము రుమాలు వేశామని ఒకరు..మేము టవల్ వేశామని మరొకరు ఇలా ఒక్కో సాకుతో ప్రతిరోజూ బస్సుల్లో గొడవలు పడుతున్న సందర్భాలు అనేకం. బస్సుల్లో పురుషులు ప్రయాణం చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. డిపోల నుంచి బయలు దేరిన కొన్ని బస్సుల్లో పురుషులపై మహిళలు దాడికి పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి.. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే బస్సుల సంఖ్య పెంచి సర్వీసులను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టు జారితే అంతే


బస్సు ద్వారం వద్ద నిల్చుని బయటకు వేలాడుతూ విద్యార్థులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో పలు కళాశాలలకు వచ్చి వెళ్లేందుకు ఎంతోమంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తారు. ఈ మేరకు ఇటీవల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉన్న అరకొరగా ఉన్న బస్సులు ఖాళీ లేకుండా ప్రయాణికులతో నిండి ఉండడంతో విద్యార్థులు ఇలా ప్రమాదకరంగా బస్సు ద్వారం వద్ద నిలబడి ప్రయాణం చేస్తున్నారు. దీంతో ద్వారం వద్ద కదిలే బస్సులో ప్రమాదకరంగా ప్రయాణం చేయడంతో తోటి ప్రయాణికులు సైతం ఆందోళన చెందుతున్నారు.

జిల్లా పరిధిలో అందుబాటులో 237 బస్సులు



జిల్లా వ్యాప్తంగా మూడు డిపోల పరిధిలో 237 బస్సులు అందుబాటులో ఉన్నాయి. అందులో స్త్రీశక్తి పథకానికి 187 బస్సులను అందుబాటులో ఉంచాం. కొన్ని ప్రాంతాల్లో వంతెనలు, కాజ్‌వేలు, రహదారుల మరమ్మతుల కారణంగా బస్సులు కొన్ని సందర్భాల్లో ఆలస్యంగా వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు బస్సుల సర్వీసులను పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. అందుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపించాం.– పి. వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజారవాణాధికారి, పార్వతీపురం మన్యం

గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు

- డీఐజీ గోపీనాథ్ జెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

విశాఖ సిటీ/పార్వతీపురం రూరల్/విజయనగరం క్రైమ్: గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఎస్పీలను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం రేంజ్ పరిధిలోని అల్లూరి, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో డీఐజీ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, వివిధ నేరాల నిరోధక చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. అక్రమ గంజాయి రవాణా వ్యాపారంలో పాల్గొన్న 14 మంది నేరస్తుల ఆస్తులు రూ.10,04,89,621 స్వాధీనం చేసుకోవడాన్ని అభినందించారు. ఇప్పటి వరకు 1,119 మంది గంజాయి నేరస్తుల కదలికలపై షీట్లు తెరిచినట్లు చెప్పారు. అలాగే 51 మంది నిందితులపై పీడీ చట్టం, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలుకు ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు. తరచూ గంజాయి రవాణా చేసే 368 మంది, అలాగే గంజాయితో పాటు ఇతర నేరాలలో పాల్గొన్న 370 మందిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిలబుల్ వారెంట్ల ఆధారంగా 341 మందిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు శిక్షలు పడ్డాయన్నారు. వీరిలో 24 మందికి 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. విశాఖపట్నం రేంజ్ పోలీసులు స్టే సేఫ్, నిదాన్, కాజ్, నాట్ గ్రిడ్ యాప్స్ ద్వారా పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడంలో కృషిని అభినందించారు. మహిళలు, పిల్లలపై లైంగిక నేరాలు, మహిళ మిస్సింగ్ కేసులపై సమీక్షించారు. ఇటువంటి కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని చెప్పారు. రేంజ్ పరిధిలోని శాంతి భద్రతల సమస్యలపై చర్చించారు. భవిష్యత్తు కోసం తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అనాథ బాలికలకు 100 సైకిళ్ల పంపిణీ


బాడంగి హైస్కూల్‌లో సైకిళ్లను పంపిణీ చేస్తున్న వీకే, కెనరాబ్యాంకు డీజీఎం, ప్రతినిధులు

బాడంగి: విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తల్లితండ్రులు లేని అనాథబాలికలకు సుమారు రూ.4లక్షల విలువైన 100సైకిళ్లను పంపిణీ చేశారు. బాడంగి హైస్కూల్‌లో హెచ్‌ఎం సత్యనారాయణ అధ్యక్షతన బొబ్బిలి డిప్యూటీ డీఈఓ మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. బెంగళూరుకు చెందిన వసుధైక కుటుంబం, కేజీబ్రీసంస్థ, కెనరాబ్యాంకువారి సౌజన్యంతో సైకిల్స్ సమకూర్చగా కనీసం పాఠశాలలకు రెండుకిలోమీటర్ల దూరం, 85శాతం మార్కులు సాధించిన అనాథ బాలికలకు అందజేశారు. అదేవిధంగా హైస్కూల్‌లో చదువుతున్న 50 మంది అనాథబాలికలకు ఒక్కొక్కరికి నెలకు వెయ్యి రూపాయలు చొప్పున రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో వీకేపౌండేషన్ ప్రతినిధి ప్రతాప్, కెనరాబ్యాంకు డీజీఎం అనంతపద్మనాభం, రీజనల్‌మేనేజర్ వినోద్, సీనియర్ మేనేజర్ రాజ్యలక్ష్మి, ఎంఈఓ. లక్ష్మణదొర, జెడ్పీటీసీ పెద్దింటిరామారావు, ఎంపీటీసీ డి.శ్రీనివాస రావు, సర్పంచ్ కండి రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ భారతి, మూడు జిల్లాలనుంచి హాజరైన బాలికలు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు నిర్వహించారు.

మలేరియా మాత్రలు మింగి మహిళ ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న సూరమ్మ


కురుపాం: మండలంలోని ఏగులవాడ పంచాయతీ ఈతమానుగూడ గిరిజన గ్రామానికి చెందిన మండంగి సూరమ్మ (30) మలేరియా మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై కురుపాం ఎస్సై నారాయణరావు అందించిన వివరాల్లోకి వెళ్తే.. గురువారం రాత్రి భర్త మండంగి సురేష్‌ను భార్య సూరమ్మ మద్యం తాగవద్దని మందలించగా ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో మనస్తాపం చెందిన సూరమ్మ ఇంట్లో ఉన్న 8 మలేరియా మాత్రలను మింగి అపస్మారక స్థితిలోకి జారుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం మొండెంఖల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడూరుమాత యాత్రోత్సవం నేడు


కోడూరు మరియమాత పుణ్యక్షేత్రం

బాడంగి: మండలంలోని కోడూరు మరియ మాత యాత్రోత్సవం శనివారం జరగనుంది. ఈ యాత్రలో సుమారు 20వేలమంది క్రైస్తవ, ఇతర మతస్థులైన యాత్రికులు పాల్గొనున్నారు. ఈ యాత్రకు సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, విజయనగరం డిపోలనుంచి ఆర్టీసీవారు ప్రత్యేక బస్సులు నడపనున్నారు.ఉదయం నుంచే దివ్య బలిపూజలు నిర్వహించనున్నారు.మూడవపూజకు విశాఖ అగ్రపీఠాధిపతులు హాజరుకానున్నారు.భక్తులు మాతను దర్శించుకునేందుకు వీలుగా బారికేడ్లు ఏర్పాటయ్యాయి. బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి, రూరల్ సీఐ నారాయణ రావు తోపాటు ఎస్సై సిబ్బంది శుక్రవారం యాత్ర స్థలాన్ని సందర్శించి యాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందో బస్తు ఏర్పాట్లు చేయనున్నారు. ఆర్టీసీబస్సులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వన్‌వే ట్రాఫిక్‌ను పాటిస్తూ బాడంగిలోని పిన్నవలస జంక్షన్ వద్ద ప్రవేశించి కోడూరునుంచి రామచంద్రపురం మీదుగా బయటకు వెళ్లనున్నాయి. కాలినడకన పలువురు భక్తులు రానున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ


చోరీ సంఘటనపై స్టేట్‌మెంట్ తీసుకుంటున్న ఎస్సై సుదర్శన్

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం సమీపంలో రైవాడ కాలువ గట్టుపై గుర్తుతెలియని వ్యక్తి ఓ మహిళ మెడలో గొలుసును తెంపుకుని పారిపోయాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన నెక్కల లక్ష్మి తన తల్లితో పశువులకు గడ్డి కోసుకుని వస్తుండగా గ్రామసమీపంలోని రైవాడ కాలువగట్టుపై ఓ వ్యక్తి ముఖానికి మాస్క్ వేసుకుని వచ్చి వెంకటలక్ష్మి మెడలో గొలుసు తెంపుకుని పారిపోయాడు. దీంతో వెంకటలక్ష్మి వల్లంపూడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులను ఆరా తీశారు. గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీ కోసం సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు పోలీసు బృందాలతో విచారణ చేయుస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం

- జిల్లా ప్రజా రవాణా అధికారి
- డయల్ యువర్ డీపీటీఓకు 26 వినతులు


డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణా అధికారి వెంకటేశ్వరరావు

పార్వతీపురంటౌన్: జిల్లాలోని పల్లెలు, గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రజా రవాణాధికారి కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమానికి 26 వినతులు ఫోన్ ద్వారా వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులను సంప్రదించి సాధ్యమైనంత వరకూ పల్లెలకు, శివారు గ్రామాలకు బస్సు సౌకర్యం అలాగే స్టాపుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వచ్చిన వినతుల్లో కొన్ని

విశాఖపట్నం–పార్వతీపురం చివరి ట్రిప్ పార్వతీపురం టౌన్‌లోకి వచ్చే విధంగా ఏర్పాటు చేయలని పార్వతీపురం నుంచి వి.శ్రీహరి కోరారు.
- పార్వతీపురం నుంచి దుగ్గేరు బస్సును రెండు ట్రిప్ లు పెంచమని దుగ్గేరు నుంచి జి.జనార్దన రావు కోరారు.
- పార్వతీపురం నుంచి పెద్ద బుడ్డిడికి బస్సు సౌకర్యం కల్పించాలని పెద్ద బుడ్డిడి నుంచి ఆర్.రాజు విజ్ఞప్తి చేశారు.
- మక్కువ నుంచి విశాఖపట్నం, దుగ్గేరు –బొబ్బిలి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించమని దుగ్గేరు నుంచి బి.రామకృష్ణ, కె. సీతారాంలు కోరారు.
- పాలకొండ నుంచి గుమ్మలక్ష్మీపురం వయా వీరఘట్టం, జియ్యమ్మవలస మీదుగా బస్సు సౌకర్యం, పాలకొండ – కురుపాం గ్రామాలకు మరో బస్సు సర్వీసు పెంచాలని, అలాగే పార్వతీపురం –జియ్యమ్మవలస వరకు ఉన్న బస్సు సర్వీస్‌ను వీరఘట్టం వరకు పొడిగించాలని వీరఘట్టం నుంచి ఎస్.లక్ష్మినాయుడు ఫోన్ ద్వారా కోరారు.
- బొబ్బిలి బస్ స్టేషన్లో టాయిలెట్ చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని, సాలూరు, బొబ్బిలి కాంప్లెక్స్‌ల లో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరారు.
- చీపురుపల్లి పార్వతీపురం మధ్య బస్సు సౌకర్యం అలాగే విశాఖపట్నం–జైపూర్ వయా అలమండ మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని కొంతమంది ప్రయాణికులు కోరారు.

ద్విచక్రవాహనాల నుంచి పెట్రోల్ చోరీ

- సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలు


పెట్రోల్ తీస్తుండగా సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యం


పార్వతీపురం రూరల్: రాత్రివేళ ఇళ్ల వెలుపల వీధుల్లో ఉంచే ద్విచక్ర వాహనాల నుంచి గుర్తుతెలియని దుండగులు పెట్రోలు దోచేస్తున్నారు. దీంతో ద్విచక్రవాహనదారులు వెలుపల తమ వాహనాలను ఉంచేందుకు భయాందోళన చెందుతున్నారు. గురువారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని కొత్తవలస ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న వెంకట్రావు అనే వ్యక్తి షాపు, ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనాల నుంచి ఓ గుర్తుతెలియని వ్యక్తి రాత్రి 1:40 గంటల సమయంలో పెట్రోలును గుట్టుచప్పుడు కాకుండా సేకరిస్తున్న దృశ్యాలు సీసీకెమెరాలో రికార్డ్ అయ్యాయి. శుక్రవారం ఉదయం బయటకు వెళ్లేందుకు వాహనాన్ని తీసే క్రమంలో పెట్రోల్ దొంగిలించినట్లు అనుమానంతో సీసీ కెమెరాలు పరిశీలించి తెలుసుకున్నట్లు తెలిపారు. అలాగే కొత్తవలస పరిసరప్రాంతాల్లో ఇదే తరహాలో ద్విచక్ర వాహనాలనుంచి పెట్రోల్ దొంగిలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు స్థానిక పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తి పెట్రోల్ తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో తమ వీధుల్లో కూడా ఇలాంటి ఘటనలు జరిగినట్లు పలువురు వాపోతున్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష


ముద్దాయి కంకణాల కిరణ్

విజయనగరం క్రైమ్/తెర్లాం: ఈ ఏడాది ఫిబ్రబరి నెలలో నమోదైన పోక్సో కేసులో అరెస్ట్ అయిన నిందితుడు కిరణ్ (36)కు మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నాగమణి తీర్పు ఇచ్చారని ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలిపారు. కేసు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని తెర్లాంకు చెందిన ఓ బాలిక (12) నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కంకణాల కిరణ్ వెనక నుంచి వచ్చి బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో, దగ్గరలో ఉన్న కొంత మంది వచ్చేసరికి నిందితుడు పారిపోయాడు. ఆ బాలిక ఇంటికెళ్లి కన్నవారికి చెప్పగా బాలిక తల్లి తెర్లాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ బి.సాగర్ బాబు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కేసు నమోదైన 7 నెలల కాలంలోనే ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా తెర్లాం ఎస్సై బి.సాగర్ బాబు చర్యలు చేపట్టారని ఎస్పీ తెలిపారు. కోర్టులో నేరారోపణలు రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, బాధితురాలికి పరిహారంగా రూ.25,000 ఇవ్వాలని పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఎస్పీ వివరించారు.

115 డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.11.50 లక్షల జరిమానా


ఎస్పీ వకుల్ జిందల్

మద్యం తాగి వాహనాలు నడిపి, పట్టుబడిన 115 మంది వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి విధించారని ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 115 కేసులు నమోదు చేసి విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా వారందరికీ రూ.11.50 లక్షలను జరిమానాగా విధించారని ఎస్పీ తెలిపారు.

14న జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడకారుల ఎంపిక పోటీలు ఈనెల 14న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌క్రీడామైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంపిక పోటీల్లో 2006 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించి, బాలురు 75 కేజీల లోపు, బాలికలు 65 కేజీల లోపు బరువు కలిగి ఉన్నవారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు కృష్ణా జిల్లా గొల్లపూడిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 9949721949 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏపీలో ఉత్తమ రిసార్ట్స్‌గా సన్‌రే


ఎంపీ చిన్ని, మంత్రులు శ్రీనివాసరావు, భరత్ చేతులమీదుగా అవార్డు స్వీకరిస్తున్న రాజాబాబు

భోగాపురం: భోగాపురంలోని ఎ.రావివలస సమీపంలో ఉన్న సన్‌రే విలేజ్ రిసార్ట్స్ ఏపీ ఉత్తమ టీం బేస్ట్ రిసార్ట్‌గా గుర్తింపు పొందడం సంతోషించ దగ్గ విషయమని మేనేజింగ్ డైరెక్టర్ ఇందుకూరి రాజాబాబు తెలిపారు. ఈ మేరకు విజయవాడలో శుక్రవారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాసరావు, భరత్ చేతులమీదుగా ఏపీ ఉత్తమ టీం రిసార్ట్ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ పురస్కారంతో వరుసగా ఏడోసారి గౌరవం దక్కినందుకు సంతోషిస్తున్నానని రాజాబాబు పేర్కొన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రతి ఉద్యోగి కృషికి ఆయన అభినందనలు తెలియజేశారు.

చికెన్ బ్రాయిలర్	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
	₹152	₹274	₹284